కథ

# మేడిపండు

— వలివేటి నాగచంద్రావతి.



ఆవిడో గొప్ప సంఘసేవకురాలు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకీ పథకాలకీ ముఖ్య ప్రోత్సాహకురాలు.

ప్రజోపయోగ కార్యకలాపాలలో ప్రధానపాత్ర వహించే జన శ్రేయోభిలాషి.

రాత్రనకా, పగలనకా, శరీరశ్రమ అనుకోకా మీటింగుల్లోనూ, పార్టీల్లోనూ ఎడతెరిపిలేకుండా పాల్గొంటూ కేవలం మానవ సేవే తన లక్ష్యమనీ, అందుకొరకే తన ఈ తాపత్రయమంతా అంటూ ప్రసంగాలు చేస్తూ కాలం గడిపేస్తున్న ప్రజాహితురాలు.

సంసారమనీ, భర్త అనీ, పిల్లలనీ మమకారాలన్నీ వదిలేసుకుని ఇంట్లో తప్ప ప్రతిచోటా తానే అయివుంటూ ప్రజాసేవకే జీవితాన్నంకితం చేస్తున్న నిస్వార్థపరురాలు.

గిట్టనివాళ్ళు ఆమె గురించి ఏవో అవాకులూ, చెవాకులూ పేలుతుంటారు; తప్పుడు నిందలేవో ప్రచారం చేస్తుంటారు; అవన్నీ మనకేల?

ఎదురుగుండా అగుపించేదే లెక్కలోకి తీసుకుందాం.

రెండునెలలకోసారైనా ఆమె ఫోటో-ఫలానా సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఫలానా మంత్రిగారికి పూలహారం వేస్తున్నట్లో, ఒకానొక కంపెనీవారు నిర్వహించిన పోటీలో గెలుపొందిన వారికి ఆ కంపెనీ తరఫున బహుమతి ప్రధానం చేస్తున్నట్లో, ఫలానా కళాశాల విద్యార్థులు వసూలుచేసిన చందా తాలూకు చెక్కు ఏ జీవకారుణ్య సంఘ ప్రతినిధికో సమర్పిస్తున్నట్టుగానో, ఫలానా చిత్రం శతజయంతి ఉత్సవ సంవత్సరంలో ఫలానా నటుడిని స్టేజీమీద అభినందించి కరచాలనం చేస్తున్నట్టుగానో-అనన్య ప్రచారంగల దినపత్రికల్లోనూ, అశేష జనవాహినిని విశేషంగా ఆకర్షిస్తున్న వారపత్రికల్లోనూ పడుతూనే వుంటుంది.

నెలకొకసారైనా ఆమెను గురించిన వార్త - గాంధీ జయంతినాడు ఫలానా మహిళా మండలి తరఫున ఆ సభ్యురాండ్రతో కలిసి, ఫలానా మురికివాడ శుభ్రం చేశారనో,

ఫలానా విజ్ఞానయాత్ర పర్యటన బృందానికి నాయకత్వం వహించారనో,

ఫలానా వారి చిరంజీవి తొలి ఆరంగ్రేటానికి హాజరయి సదరు ఆ చిన్నారిని ఆశీర్వదిస్తూ ఉపన్యసించారనో అచ్చులో కనిపిస్తూనే వుంటుంది.

ఇన్ని మాటలెందుకు-ఆ తాలూకాలో, మళ్ళా మాట్లాడితే ఆ జిల్లాలో ఆమెను ఎరుగనివారుగానీ, ఆమె పేరు విననివారుగానీ లేరంటే సత్యదూరం లేదు. ఆమె వేలుపెట్టని, ఆమె చెయ్యికలపని సంస్కరణగానీ, ఉద్యమంగానీ లేదంటే అతిశయోక్తి కాదు.

నలుగురు పెద్దలు కూడిన సమావేశాల్లో ఆవిడ ప్రసక్తి వచ్చినపుడు "ఆహా.. ఆమె వంటి అభ్యుదయ మహిళ నభూతో నభవిష్యతి" అంటూ ప్రస్తుతించటమూ కద్దు.

వారు లోలోపల ఏమనుకునేదీ మనకు తెలియదు కదా-అది పెరుమాళ్లకే వదిలేద్దాం.

ఇలా ఎన్నేళ్లబట్టినో ఆమె బహుముఖంగా సేవలు చేస్తోన్నా ఈమధ్యనే ఆ కృషికి సరియైన గుర్తింపు వచ్చిందని చెప్పొచ్చు.

'కీర్తి కిరీట సన్మాన సమితి' అని ఒక ధనిక సంఘకూటమివారున్నారు. ఏటా ఆశ్రిత జన పక్షపాతులైన తమ కమిటీ సభ్యులచే ఎన్నుకొన్న ఒక పేరెన్నికగన్న స్త్రీరత్నాన్నో పురుష పుంగవుణ్ణో సన్మానించి శాలువాకప్పే ఆనవాయితీ వుంది వారికి.

ఆ మర్యాద ఈసారి ఈ ప్రజాక్షేమాకాంక్షిణికి దక్కింది.

శుభం.

పడనివాళ్లు ఆ కమిటీలో ఆమె మేనత్త పెనిమిటి ఉన్నాడని చెవులు కొరుక్కున్నారు. పోనీండి-మనమీ పుకార్లు నమ్మరాదని ముందే అనుకున్నాం కాబట్టి పట్టించుకోవద్దు.

కీర్తికి కిరీటం అనదగిన ఈ సత్కారం ఆమె మునుపటి పేరుప్రతిష్ఠలని రెట్టింపుగా ఇనుమడింపచేసినందుకు మాత్రం సంతోషించుదాం.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే.

నేనో పాత్రికేయుణ్ణి. మా పత్రిక ఆమె నివసిస్తున్న నగరం నుంచే వెలువడుతోంది.

రాష్ట్రం నలుమూలలనుంచీ వెలువడే వివిధ పత్రికలూ ఆమెకు జరిగిన పురస్కారణ వివరాలు ప్రచురించినాయి.

అయితే-మా పత్రికలోనూ వారికిమాదిరిగానే ఏదో నాలుగు ముక్కల్లో ఆమె ప్రశంస ముగించటం మా సంపాదక మహాశయులకి మనస్కరించకపోయింది.

మావూరి మనిషి కద! ఆ ప్రత్యేకత నిలబెట్టవలిసిన ధర్మం స్థానికమైన మా పత్రికమీద వున్నది.

ఆమెగారి పుట్టుపూర్వోత్తరాలూ, సమగ్ర జీవిత విశేషాలతోకూడిన ఒకమాదిరి భారీసైజు వ్యాసమొకటి ముఖ్యమైన ఫోటోలతో సయితం ప్రచురించాలని సంకల్పించింది మా పత్రిక.

ఆమెతో ఇంటర్వ్యూ జరిపి తెలుసుకోదగిన విషయాలన్నిటినీ సేకరించాల్సిన బాధ్యతను నాకప్పగించారు

అంతటి భాగ్యం నాకిచ్చినందుకు మహదానందమయింది నాకు.

ఓ సుముహూర్తాన-అంటే లగ్నం అదీ పెట్టించి అనిగానీ, తిథి, వార, నక్షత్రాలు మంచివిగా చూసి అనిగానీ అనుకునేరు... కాదు సుమండీ! ముందస్తుగానే తెలియజేసి ఫిక్సుచేసుకున్న టైమన్నమాట!

అయినా అలాటి మహానుభావులు దర్శనం ఏక్షణాన్నయినా అది అమృత ఘడియే కదండీ!


సరే. సరిగ్గా అనుకున్న సమయానికి వారింటికి చేరుకున్నాను.

రెండతస్థుల భవంతి అది. మేడమీద ఆమె నివాసమని తెలిసింది. పైకి వెళ్ళాను.

బాల్కనీలో ఎవరూ లేరు. నాలుగు కేన్ కుర్చీలుమటుకు అస్తవ్యస్తంగా వేసి వున్నాయి. టీపాయ్ అయితే ఓపక్కకి దొర్లిపోయి వుంది.

లోపల్నుంచి అదేమి శబ్దమో-ఒకేసారి ఇద్దరు ముగ్గురు రెండు మూడు భాషల్లో ఒకరిమాటలొకరికి అర్థంకానీకుండా గొంతు చించుకు కీచులాడుకుంటున్నట్టు,-

గిన్నెలు, గరిటలు, గ్లాసులు ఆదిగాగల వంటింటి సామాగ్రితో అతి నైపుణ్యంగా అత్యంతోత్సాహంతో కేరింతలు కొడుతూ ఫుట్ బాల్ ఆడుకుంటున్నట్టు,-



రేడియోలో క్రికెట్ కామెంటరీ, ట్రాన్సిస్టర్‌లో పాత వాసన కొడుతున్న గొంతుతో సైగల్ పాటా, టేప్‌రికార్డర్‌లో వెస్టరన్ మ్యూజిక్,

దానికి లయగా ఎవరో అడుగులు వేయాలని చేసే ప్రయత్నం-,

అపస్వరాలూ, సుస్వరాలూ బోలెడు మోతలొక్కసారి కలగా పులగమయి విచిత్రమయిన ధ్వనిగా వినవస్తోంది.

సింహద్వారం దాకా వెళ్ళి తొంగిచూశాను.

ఇందాక చెవులతో విన్న ధ్వనులన్నీ ఇప్పుడు రూపుదాల్చిన దృశ్యాలయి కళ్ళగట్టాయి.

గుమ్మం ఎదురుగా నిలబడినా నన్నెవరూ గమనించే స్థితిలో లేరక్కడ.

నా ఉనికిని తెలియజేస్తూ దగ్గాను; సకిలించాను; పెను తుఫాను హోరులో మేళతాళాల సౌండు వినరానట్టు నా ప్రయత్నం ఫలించలేదు.

ఏ రాంఢోళ్లలాంటివో మోగించాలే తప్ప అక్కడి కోలాహలంతో ఈ బుల్లి బుల్లి చప్పుళ్లేం వినిపిస్తాయి మరి!

హతాశుడనై ఏంచెయ్యటమా అని అటూ ఇటూ పారజూస్తూంటే గుమ్మానికున్న కాలింగ్‌బజర్ దృష్టిని పడింది.

ఇంకోరాయి విసురుదాం. అన్నట్టుగా నొక్కాను.

ఈసారి అదృష్టం బావుంది.

అది ఎక్కడ మోగిందో తెలీదుగానీ పనిచేసే మనిషి మోస్తరున్న ఓపద్నాలుగేళ్ల పిల్ల పరిగెత్తుకొచ్చింది గుమ్మంలోకి.

అవటానికి పనిమనిషే! వేషమూ అందుకు తగ్గట్టే; కానయితే ఏం ఠీవి.. ఏం ఠీవి ఒలకపోసిందనీ!

రెండు చేతులూ నడ్డికానించుకుని, ఒకవేలు మండిగం మీద వుంచి సత్యభామ ఫోజులో నిలబడి, "అమ్మగారా? అయ్యగారా? ఎవరికోసం?" అనడిగింది స్టైలుగా నిలదీసి.

దానివాలకం చూస్తే ఆ ఇద్దరిలో దానికిష్టమైన వారికోసమొచ్చిన వాళ్లనయితేనే కూర్చోనిచ్చేటట్టూ, అయిష్టమయిన వారికోసమొస్తే తరిమికొట్టేటట్టూ అవుపడ్డది.

అయితే అమ్మగారూ అయ్యగార్లలో దానికిష్టమయిన వారెవరో తెలుసుకోటం నాకు ఆధారం ఇవ్వని పజిల్ అయిపోయింది.

బెరుకు బెరుకుగానే "అమ్మగారి కోసం" అన్నాను.

వెంటనే దాని ఫోజు మారిపోయింది. మండిగంమీద వేలు దిగిపోయింది. చేతులు రెండూ నమ్రతనభినయిస్తూ నడ్డినుంచి కిందికి దిగజారినై.

నేను ఊపిరి పీల్చుకున్నాను.

"కూచోండయ్యగారూ! అమ్మగారితో చెప్పివస్తాను. ఎవరొచ్చారని చెప్పమంటారు?" అనన్నది అతి వినయంగా.

నేను నా విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాను. రాకెట్లా దూసుకువెళ్ళింది లోపలికి.

ఈ లోపల ఇంట్లో సందడి కొంచెం సద్దుమణిగింది. ఒకరిద్దరు కుటుంబ సభ్యులుగావును-తొంగి చూసి వెళ్లారు. ఒక పదేళ్ల పాప చూట్టంతో సరిపెట్టక నవ్వుతూ ఇవతలికొచ్చి, గోడవారగా ఓ కేన్ కుర్చీ జరిపి స్పాంజి సీటు సరిజేసి, "కూర్చోండంకుల్" అన్నది నవ్వుతూనే.

"అమ్మ..అమ్మ.. ఏం మర్యాద! ఏం మర్యాద!"

ఇంట్లో ఇప్పటిదాకా సాగిన అల్లరిలో ఈ పాపకీ భాగం వుండివుండొచ్చును. అయితేనేం-బయటికొచ్చేసరికి ఎంత నెమ్మనిదయిపోయింది! పెద్దలంటే ఎంత మన్నన, ఎంత గౌరవం చూపిస్తోంది! అదీ పెంపకంలో క్రమశిక్షణ అంటే.

అనుకుంటాం గానీ అల్లరి పిల్లలు కాకపోతే పెద్దలు చేస్తారా-? అది వాళ్ల జన్మహక్కు. పిల్లలు అల్లరి చేస్తేనే అందం; ఆరోగ్యకరం.

నేను సంతోషిస్తూ కూర్చున్నాను.

హా...హత విధీ! ఏమయింది? వెన్నుపూస జారిపోయింది. కూర్చున్నది కుర్చీలోనే. కుదేలయింది కుర్చీమధ్యనించి నేలమీదికి.

కిసుక్కున నవ్వుతూ లోపలికి పరుగుతీసిందా రాలుగాయి పిల్ల.

ఒక చిన్న పిల్లచేతిలో పరిహాసం పాలవటం చిన్నతనమే.

ఒకపక్క అవమానం; ఒకపక్క బాధ; ఏం చేయనూ? కనీసం కళ్లెర్రచేసి చూద్దామన్నా కనబడకుండా పోయిందయ్యో.

గుడ్డిలో మెల్ల; కీడులో మేలు; ఈ పరాభవాన్ని ఆ అమ్మాయీ నేనూ తప్ప మూడో కన్నెరగదు. అంతే చాలును.

ఎలాగో ఆ ఇరుకులోంచి తిప్పలుపడి పైకి లేచాను.

ఇంకో కుర్చీ... ఈమాటు స్పాంజిసీటు అడుగున కేనూ అదీ సరిగ్గావుందా లేదా అని బాగా పరీక్షచేసి చూసుకుని మరీ పిట్టగోడకి దగ్గరగా వేసుకుని కూర్చున్నాను ఆవిడకోసం నిరీక్షిస్తూ.

ముప్పావుగంటసేపు వీధిలో తిరిగే జనాన్నీ పరిగెత్తే వాహనాల్నీ ఎదురింటి ఆవరణలో వున్న బాదంచెట్టునీ, దాని కొమ్మలమీద సర్కస్‌లో గాలరీ జనంలా బారులుతీర్చి కూర్చున్న వాయస సమూహాల్నీ సినిమా మధ్యలో కరంటాగిపోతే ఒక్కసారిగా గల్లంతుచేస్తూ పెచ్చరిల్లిపోయే మూడవక్లాసు ప్రేక్షకుల్లా అవిచేస్తున్న గోల చూస్తూ గడిపాను.

యుగాల తపస్సు అనంతరం కటాక్షించి సాక్షాత్కరించిన దేవతామూర్తిలా ఆమె ఊడిపడింది ఇంట్లోంచి.

"అరెరె.. మిమ్మల్ని ఇక్కడే కూర్చోపెట్టేశారా? అని నొచ్చుకుని, "రండి.. రండి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుందాం". అంటూ లోనికాహ్వానించింది.

డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చోబోయే ముందు కూడా మర్చిపోకుండా వత్తిచూసి మరీ జాగ్రత్తగా కూర్చున్నాను.

పరిశీలనకు అలవాటుపడ్డ ప్రాణం కదా! చుట్టూ చూశాను.

గోడలకు వేసిన పెయింటు మొదలుకొని ఫర్నిచరు, అలంకరించిన డెకరేషన్ పీసెస్ వరకూ అన్నీ అప్‌టు డేట్‌గా అందంగా విలవగలవిగానే వున్నాయి.

కానీ అవి ఎలా వున్నాయని చెప్పను?

ఉన్న మూడు సోఫాల్లో రెండింటికి మాత్రమే కవర్లు వేసి వున్నాయి. అందులోనూ ఒకటి రంగుది; ఒకటి పూలది.

గోడలకి చెయ్యి అందినంతవరకూ ఏవేవో పిచ్చిగీతలు; రంగులేవో పులిమిన ముద్దర్లు.

మూలన వుండాల్సిన పూలతొట్టె స్టాండు టీపాయ్‌మీద పడుకోబెట్టి, ఎండిపోయిన పూలతో మూలిగే ఫ్లవర్‌వాజు కిటికీలో.

గోడలమీద ఒక క్రమమంటూ లేకుండా వేలాడదీసిన సీనరీలు;

చక్కని నగిషీలు చెక్కిన బుక్‌షెల్ఫ్‌లో వుండాల్సిన పుస్తకాలు చిందరవందరగా నేల మీద; కాళ్లకింద పరిచిన తివాచీనిండా బురద మరకలు... అదీ గది అవతారం.

నా రంధ్రాన్వేషణింకా పూర్తికాలేదు. ఇంక నాదృష్టి చివరి దూలానికి వేలాడుతున్న బూజు మీదా, ఎప్పుడాగిపోయిందో తెలియకుండా వున్న గోడగడియారం మీదా చిక్కువడే వుంది.

ఇంతలో అతిథిసత్కార సూచకమైన పానీయాలు-అదే-కాఫీలు వచ్చేశాయి.

కమ్మని బ్రూ సువాసనలీనుతూ నాసికా పుటాల్ని ఉల్లాసపరుస్తోంది. జిహ్వా లాలాజల ప్రవేశం చేయిస్తోంది. కానీ కప్పే కాస్త....

"-మరి మనం ప్రొసీడవుదామా అహ..ఏం లేదూ... నాకవతల ముఖ్యమైన కార్యక్రమాలున్నాయి-"

ఆఖరి సిప్ ఆస్వాదనలోవున్న నన్ను హెచ్చరించారావిడ.

"ఎంతమాటెంతమాట-కాదుమరీ- నాబోటిలాకాయీ మనిషా ఆవిడ-ఎన్ని జరుగురుల్లో ఏవిటో- ఏమి తలమునక వ్యాపకాలో-కాఫీ చుక్క చుక్కే చప్పరించే తీరుబాటెక్కడిదీ-?"

నేను దిక్కులు చూడ్డం చాలించి వచ్చిన పనిలో పడ్డాను.

నాకావిడ చాలా గొప్పగా కో ఆపరేట్ చేశారు.

నానుంచి ప్రశ్న వెలువడ్డ ఆలస్యంగా దాని పూర్వాపరాలన్నీ- మరా విషయంగా మళ్ళీ మరే మీ ప్రశ్నించే అవసరం నాక్కలకుండా, ఎట్టి సందేహలేశమూ మిగలనీకుండా ఆమె జవాబు నిస్తున్న ధోరణి- కొంటెమనసు 'గారెలెలా వండాలి పెద్దమ్మా అంటే కసవు వూడ్చి కల్లాపి జల్లడం దగ్గర్నించి ప్రారంభించినట్టు' అన్న సామెతని మాటిమాటికీ గుర్తుకు తెస్తున్నా నిజంగా అనన్య సామాన్యమని ఒప్పుకు తీరాలి.

మరోకటి- ఆహా- ఏమి అద్భుతమైన జ్ఞాపకశక్తండీ ... అందుగ్గూడా ఆవిణ్ని అభినందించాలి.

"మీ జీవిత విశేషాలు ఏదైనా క్లుప్తంగా..." అని నేను వేసిన చిన్నప్రశ్నకు బదులుగా ధారాపాతంగా ఏమి చెప్పిందంటే ఆవిడ...

చిన్నతనంలో తనను ప్రభావితురాలిని చేసి కరుణరసంలో ముంచెత్తిన సంఘటనలు, అసలు తన వంశ రక్తంలోనే నిండి ఉన్న దయాగుణం, బాల్యంలోనే తనలో వెల్లివిరిసిన అభ్యుదయ భావాలు, పరిమళించిన తన ప్రతిభాపాటవాలు, తరవాత్తరవాత తను ముందంజవేసిన వివిధ ఘట్టాలు.,

తన నాయకత్వాన నడిపించిన ఉద్యమాలు, తను ముందుండి జరిపించిన సంస్కరణలు, దీనజనసేవలు, తాను నిర్వహించిన సాంఘిక సంక్షేమ కార్యకలాపాలు.,

మామూలు మనుషుల్లోంచి తనను ప్రత్యేకించి నిలబెట్టగలిగిన తన అర్హతలు,

ప్రముఖులు తమ ప్రసంగాల్లో- నామమాత్రంగానే అనుకోండి- తన సేవల నుగ్గడించిన సందర్భాలు... ఇలా వరసగా ఒక్కటీ బీరుపోనీకుండా తారీఖులు... టైముతో సయితం అనర్గళ వాగ్ధాటితో చెప్పుకుపోతుంటే వాటిల్లో నాక్కావల్సినవి ఏరుకోవట ఒక్కటే నాపనయింది.

ఇక- తన నామధేయం ఉటంకించిన వివిధ పత్రికల తాలూకు కటింగులు,

తన రూపం చోటుచేసుకుని ప్రచురించిన పెద్ద చిన్న ఛాయాచిత్రాల తాలూకూ కటింగులూ, వాళ్ళ అలక్ష్యం వల్ల అచ్చు మొహం చూడలేకపోయిన మరికొన్ని తన ఘన కార్యాలు తానే వ్రాసి పెట్టుకున్న వ్రాతప్రతులూ,

ఆ అలసత్వం వల్లే ముద్రించకుండా ఉండిపోయిన ఫొటోలూ,

త్వరలో తను తలపెట్టబోతున్న మరికొన్ని లోకోద్ధరణ కార్యాల యొక్క వివరాల నమూనాలూ, ఎందరో ఘనమైన వ్యక్తులతో తను జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలూ.,

ఇవన్నీ పొందుపరిచి పకడ్బందీగా దాచి ఉంచిన ఫైల్లోంచి పుట్టలో పాముల్లా ఒకటి తరవాతొకటిగా ఆవిడ తీసి చూపి వివరిస్తోంటే ఆవిడ నిక్షిప్తం చేసిన తీరుకి, ఆ జాగ్రత్తకీ ఆశ్చర్యపడుతూ, లోలోపలే జోహార్లర్పిస్తూ గుడ్లెళ్ళబెట్టి చూస్తుండిపోయాను.

చివరిగా "మీ ఫామిలీ గురించేమన్నా చెప్తారా?" అనడిగాను సందేహిస్తూనే.

ఆవిడ భర్తే పేరుమోసిన దేవదాసనీ, మూడు ముక్కలాటలో ఆయన్ని మించిన చేయిలేదనీ ఆ ఊరందరికీ తెలుసు.

తరాలు తిన్నా తరగని తాతలనాటి ఆస్తి ఉండటం చేత పురుషలక్షణం కోసం ఆయనెప్పుడూ ప్రయత్నించలేదట.

పెద్దకొడుకు ఆరేళ్ళయి డిగ్రీలో ఎమ్మెస్సెమ్ బండెక్కి ఇప్పటికీ దిగలేక సతమతమవుతున్న చవటాగ్రేశ్వర చక్రవర్తి అనీ,

పెద్దకూతురు స్థానిక కో ఎడ్యుకేషన్ కళాశాలలో ఆడరౌడీగా పేర్గాంచుతున్న కుమారీ రత్నమనీ వినికిడి.

ఇక మిగతా పిల్లలు ఎంత బుద్ధిమంతులో నాకనుభవమే కదా. వాళ్ళు తమతమ స్వరపేటికల శక్తి కౌశల్యం ఎంత గొప్పవో చూపుతున్న కారణంగా మా మాటలు మాకే వినిపించక ఈ సమావేశంలో ఇప్పటివరకూ మొత్తంమీద ఓ అయిదుసార్లన్నా ఆపి వున్నామంటే మరి వాళ్ళెంత క్రమశిక్షణలో పెరుగుతున్నారో ఊహించుకోవచ్చు.

అంచేత 'మీ వాళ్ళ సంగతి చెప్పండి' అని అడగటానికి మొహమాటంగానే ఉన్నా తప్పనిసరి.



అది ఇంటర్వ్యూలో ఆఖరి ప్రశ్నమరి!

నా ప్రశ్నకి ఆవిడ భృకుటి ముడిపడింది.

అంతేనే మొహంలో రేఖలు ఉదాత్తంగా విడాయి.

ఎక్కడ దీనాలాపం వినబడితే అక్కడికల్లా పరుగులు తీసేనాకు ఫామిలీ గురించి విచారించే సమయమేదండీ?

నాకాలమంతా ఇతరుల క్షేమం కొరకు ఆలోచించటంలోనే చెల్లిపోతోంది.

ఎవరు బాధల్లో ఉన్నారని విన్నా ఆ కష్టం నేనే అనుభవిస్తున్నట్టుగా ఫీలయ్యే మనస్సండీ నాది.

లోకంలో ఇంతమంది దయనీయస్థితిలో ఉన్న దౌర్భాగ్యుల్నీ దీనార్తుల్నీ వారి పాటుకి వారినొదిలేసి సామాన్యమైన ఆడవాళ్ళందరిలాగే నేనుకూడా స్వార్థచింతనతో, సంసార తాపత్రయాల్లో, స్వప్రయోజనాల్లో మునిగిపోవటానికి నా హృదయం ఒప్పదండీ, అటువంటి అనాథలకు సేవచేయటమే నా ఆశయం. నా లక్ష్యం.

అందుమూలాన మా ఫామిలీ కొచ్చిన లోటు కూడా ఏమీలేదులెండి. నా స్వభావం ఎరిగిన నా భర్త నాతో సహకరించగల విశాల భావాలు కలవారుకాబట్టి ఆ బాధ్యత ఆయన తీసుకున్నారు. ఆయన సారథ్యంలో మా సంసారం ఎటువంటి లోటుపాట్లు లేకుండా నడిచిపోతోంది. అన్నారామె ధీమాగా.

'దీన్నేమంటారు- ఆత్మవంచన అనేనా' అనడుగుతున్న నా లోపలివాణ్ణి నోర్మూయ్యమని గొంతునొక్కాను.

ఆవిడ వాచీ చూసుకున్నారు.

"ఇంతకంటే ఎక్కువ సమయం మీకోసం స్పెండ్ చేయలేకపోతున్నందుకు క్షమించండి" అన్నారు. "ఇక లేవచ్చు" అన్నట్టుగా!

అబ్బే ఇంకాన్నా... ఇప్పటికే ఆ సోఫాన్నాశ్రయించుకొని వున్న మత్కుణ సమూహాల దాడితో తూట్లుపడి ఎప్పుడెప్పుడు బయటపడి మిగతా రక్తాన్ని రక్షించుకుందామా అని తహతహలాడుతోంది శరీరం.

మొత్తానికి గంటన్నరలో వ్యాసానికనొచ్చి గ్రంథానికి సరిపడా జీవితచరిత్రని సంగ్రహించివేశాను.

చేతులు జోడించి "మరి నేను వెళ్ళొస్తాను" అని చెప్పి రెండడుగులు ముందుకు వేశాను.

శివుడాజ్ఞ అయితేగానీ చీమయినా కుట్టదంటారు... శివుడాజ్ఞ అయింది గావును- రాకెట్లా పక్కగదిలోంచి దూసుకొచ్చిన గాజుకూజా నా తల వెనక గట్టితనాన్ని పరీక్షించి ఇంధనమయిపోయిన స్పైలాబులా నేలనుబడి ఘల్లున బద్దలయింది శత సహస్ర శకలాలుగా!

"అమ్మో" అన్నాను నేను అదురుకుని. కాస్త నొప్పిగూడా ఉన్నదనుకోండి-

"అరెరే" అన్నారామె కలవరపాటుగా

పక్కగదిలో సందడి సాగిపోతూనే ఉంది.

ఆమె కళ్ళెర్రజేసి గది గుమ్మం దగ్గరకు వెళ్ళారు.

ఆమె గద్దింపుల్ని వాళ్ళెవరూ పట్టించుకున్న సూచనల్లేవు.

నేను ఇబ్బందిగా నిల్చుండిపోయాను.

అరిచి అరిచి ఆవిడ అసహాయురాల్లా వెనక్కి వచ్చారు.

"ఏదీ- ఎక్కడ తగిలిందన్న" ఆమె పరామర్శకు తలమీద బొప్పిని చేత్తో తడుముకుంటూ నవ్వి "అబ్బే - చిన్నదేలెండి" అన్నాను నసుగుతూ.

తివాచీ దాటి అడుగువేద్దామంటే గాజు పెంకులు... నా చెప్పులు బయట బాల్కనీలోనే విడిచి వచ్చాను ఇందాక.

నా గుంజాటన ఆమె గ్రహించారు.

"ఉండండి ఎత్తించేస్తాను" అని హడావిడిపడ్డారు.

"లచ్చీ - లచ్చీ" అని కేకలు వేశారు- పనిపిల్లని గావును.

ఆవిడ కంఠశోష అరణ్యరోదనమే అయింది.

మర్రెండు గావుకేకలకి "లచ్చిలేదుగా మమ్మీ" అన్నారెవరో ఇంగ్లీష్ ట్యూన్‌లో.

ఆమెకి పూనకమొచ్చినట్టయింది.

"ఇడియట్... రాస్కెల్... ఎప్పుడుపోయింది? ఎక్కడకు పోయింది? దానిష్టమొచ్చినట్టు తిరగటానికా దాన్ని పోషిస్తున్నది? బాగా తిని పొగరెక్కింది... ఒళ్ళు కొవ్వెక్కింది" అంటూ శివాలేశారు కాసేపు.

అలుపొచ్చాక శాంతించారు.

అనవసరమైన ఎనర్జీ వేస్టుతో హైరాన పడుతున్న ఆవిణ్ణి చూస్తే జాలనిపించింది.

కాలు ఎక్కడపెట్టాలో వెతుక్కుంటున్న నన్ను చూసి, చేసేది లేదన్నట్టు పేపరొకటి తీసుకుని నెంపాదిగా గాజుముక్కలు ఏరటానికుపక్రమించారు ఆవిడ.

ఆ పిల్లని ఎంత నికృష్ట పరిస్థితుల్లో ఉండగా తానాదరించి చేరదీశారో, ఎంత తీర్చిదిద్దారో, ఎంత సంస్కారం నూరిపోశారో... ఇంత చేస్తే పెట్టిన తిండి వికటించినట్టు అదిప్పుడు రాటుతేలి ఎలా కృతఘ్నత చూపిస్తోందో, ఎన్ని దొంగ టక్కులు నేర్చిందో, ఎలా స్వేచ్ఛ ప్రకటించుతోందో, ఎంత జాణతనం అబ్బించుకుంటోందో... ఈ అలగా జనం మీద జాలిపడితే ఎలా నెత్తికెక్కగలరో ఉద్రేకంగా వివరిస్తున్నారు ఓ పక్క గాజుముక్కలు పోగుచేస్తూనే.

నేను కూడా నా శాయశక్తులా నా సహాయసానుభూతులందజేస్తూ ఒకటి రెండు గాజుముక్కలు ఎత్తి సాయంచేస్తున్నాను.

"ఎందుకు మమ్మీ లచ్చిని అనవసరంగా తిడతావ్? ఇందాక నువ్వేగా దాన్ని మీ క్లబ్ సెక్రటరీ లక్ష్మీదేవమ్మ గారింటికి వెళ్ళి ఏదో తెమ్మని పంపించావ్?" అని నిలేస్తోంది ఇందాకటి గడుగ్గాయి పాప గుమ్మంలో నిలబడి.

టక్కున నోరు మూతపడిపోయిందావిడకు "ముందే... ముందే ఏడవకూడదూ... ఆ మాట" ఉక్రోశంతో మొహం కందగడ్డయిపోయింది.

నేనావిడ మొహం చూడలేక దాటుకుని బాల్కనీలోకి వచ్చేశాను.

ఆమె కూడా నా వెనకే ఇవతలికి వచ్చారు. గంభీరంగా వుండటానికి ప్రయత్నిస్తూ.

నేను చేయెత్తి "శెలవు" అని చెప్పబోతున్నాను మళ్ళీ.

"మంచిది" అంటూ ఆమె కాగితంతో సహా ఆ గాజుపెంకుల్ని మేడమీంచి కిందకు గిరవాటెట్టారు.

సరిగ్గా అవి "అమ్మా తల్లీ గుప్పెడు బియ్యం వెయ్యమ్మా" అంటూ అడుక్కుంటున్న బిచ్చగాడి నెత్తిన పూరేకులల్లే వర్షించటమేమిటి- "తల్లీ ఒక్కనాడూ నాలుగుమెతుకులు విదల్చక పోతే పోయావు-నెత్తిమీద గాజుపెంకులు పోస్తావా? ఎంత పుణ్యాత్మురాలివి అమ్మా" అని దీవన్లకి లంకించుకోవటమేమిటి చూస్తుండగానే క్షణాల్లో జరిగిపోయింది.

"డర్టీ బెగ్గర్స్, మేనర్స్‌లెస్ క్రీచర్స్... వీళ్ళ మూలానే దేశం నాశనమయిపోతోంది... వీళ్ళని... అసలు వీళ్ళనీ..." ఆవిడ ఆవేశంతో రెచ్చిపోతున్నారు.

మరి నేనక్కడ నిలవలేదు.

ఆ మహాసేవా పరాయణురాలి చరిత్ర త్వరితంగా మా పత్రికలో పబ్లిష్ చేసే ఉద్దేశ్యంతో త్వరత్వరగా తలవంచుకుని దిగివచ్చేశాను.

●